# ఎల్కానా

# దైవభక్తిగల తండ్రి

## (1:1-2:21)

"తండ్రి" యొక్క పాత్ర బరువైన బాధ్యతలతో కూడి ఉంటుంది. కుటుంబ వ్యవస్థలో తండ్రి పాత్ర చాలా ప్రభావంతమైనదని సామాజిక శాస్త్రం చెపుతుంది. బిడ్డ యొక్క సాంఘీక, ఉద్వేగ, మతపరమైన క్షేమం కుటుంబంలో తండ్రి పాత్రను బట్టి నిర్ణయించ బడుతుంది. బిడ్డ యొక్క కన్నులు సగౌరవంతోను, నమ్మికతోను తండ్రివైపు చూస్తుంటాయి. "మా తండ్రి ఏదైనా చేయగలడు" అంటూ బిడ్డ దంబంగా చెప్పుకుంటాడు. ఆ బిడ్డకు గల దృష్టి తండ్రి యొక్క ప్రాధాన్యతకు వ్యాఖ్యానం చెపుతుంది. ఈ క్రింది పద్యం దాని ప్రాముఖ్యతను చాటుతుంది:

> నా తండ్రిగా ఉండే మనిషిని కొనుగోలు చేయాలని వెళ్లినట్టయితే, నేను కొనే
> (వ్యక్తి) యిలాటివాడై యుంటాడు:
> చిన్న బాలుని "ఎందుకు?" అని వేసిన ప్రశ్నకు బదులివ్వడానికి ఆగి నిలిచేవాడు.
> చిన్న బాలుడు లేక బాలికతో దయగా మాట్లాడేవాడు.
> కొంత సూర్య రశ్మి, కొంత ఆనందం యిచ్చేవాడు.
> బైబిలు యొక్క సువర్ణ సూత్రాన్ని అనుసరించే తండ్రినెన్నుకుంటాను
> క్రమంగా సంఘానికిని, బైబిలు పాఠశాలకు వెళ్లేవానిని కోరతాను.
> నా వంశవృక్షంలో స్థానం చేపట్టగల శ్రేష్ఠమైన తండ్రిని నేను కొంటాను.
> నా విషయంలో ఆయన గర్వించేలా ఆయనను పోలి ఉండడానికి నేను కృషిచేస్తాను.

దేవుడు నరుని "తండ్రిగా" నియమించి అందుకు సంబంధించిన బాధ్యతలతని కిచ్చినప్పుడు తండ్రికి "దైవభక్తి" ఉండాలని ఆయన ఉద్దేశించాడు. ఒక వ్యక్తి యిలా అన్నాడు, "నిజమైన దైవభక్తి ఆత్మలో క్రమంగా ఉన్న సూత్రమైయుంది" – బలమైన, అందమైన ఇరుసుచే అది ఎప్పుడు నిగ్రహించబడి, గోళాలకనుగుణమైనదై ఉండాలి. "దేవుని సింహాసనాన్ని నెమ్మదిగా చుట్టి వచ్చు గొప్ప చట్టము వంటిదిగా అది ఉండాలి.' ' పవిత్రుడైన మనుష్యుడు దైవభక్తిగల మనుష్యుడైయుండాలి. దైవభక్తి గలవాడు ప్రతి కార్యంలోను దేవుని ప్రధానంగా లేక మొదటిగా ఉంచుతాడు! తండ్రిగా ఉండడంలో ఈ గుణ లక్షణము ముఖ్యమైనదై ఉంటుంది!

ఎల్కానా దైవభక్తిని బాగుగా ఉదహరించాడు. "దైవభక్తి" అనడంకంటే అతనిని ఎక్కువగా వర్ణించగల పదమేదీలేదు. అతని విశ్వాసం దృఢమైనదై అతని జీవిత చర్యలన్నిటిని కొలత వేస్తుంది. ఆలాటి తండ్రిని నా పిల్లలు కలిగియుండడానికి యిష్టపడతారు.

చారిత్రకంగా, ఎల్కానాను గూర్చి ఈ సంగతులు తెలియ వచ్చాయి. కనానులో

స్థిరపడిన వారికి సంబంధించి అతడు అయిదవ తరమువాడు. అతడు లేవీ గోత్రికుడు. రామాలో ఎఫ్రాయిము మన్యమందు నివసించినవాడు. అతని గూర్చి లేఖనం బయలు పరచునదంతయు 1:1-2:21వరకు కన్పిస్తుంది. అతనికి యిద్దరు భార్యలున్నారు. పూర్వకాలం అది ధర్మబద్ధంగా అనుమతించబడేది (ద్వితీయో. 21:15). ఈ వాస్తవంతో పాటు, ప్రత్యక్షగుడారము ఎదుట అతడు అర్పించు అర్పణలను బట్టి (1:24), అతడు ధనవంతుడని తెలుపుతుంది. మోషే ధర్మశాస్త్రంలో బహు భార్యత్వానికి అనుమతి లభించినా, అది సహజంగా అంగీకరింపబడేది కాదు సరిగదా, అది దేవునిచే ఆజ్ఞాపింపబడింది కాదు, అలాంటిది ఆచరించినప్పుడెల్లా కుటుంబంలోని ఆత్మీయతలకు భంగం వాటిల్లడానికి దారి తీసింది.

దేవుని పై గల బలమైన విశ్వాసంపై స్థాపింపబడిన గొప్ప శీలంగలవాడు ఎల్కానా. ఇది గమనార్హమైనది. ఎందుకంటే, యెహోవాయందలి విశ్వాసం అసాధారణమైనదిగా ఎంచబడిన న్యాయాధిపతుల కాలంలో అతడు జీవించాడు. దైవభక్తిగల తండ్రిని గూర్చిన త్వరిత ప్రత్యక్షతలవల్ల అతని జీవితాన్ని గాఢంగా ముంద్రించిన దైవభక్తిని గురించిన లోతును తెలుసుకుంటాం.

## అతని దైవ భక్తికి ఆధారభూతమైన కారణాలు

**మొదటిది, ఎల్కానా యొక్క దైనిక జీవిత విధానం తన పిల్లలకంటె ఎక్కువ ప్రాముఖ్యతను మత భక్తికి యిచ్చినట్టు ప్రదర్శింపబడింది (1:3).** విగ్రహ పూజలకు బదులు యెహోవాను సేవించు, ఆరాధించు మనుష్యుడు యిక్కడున్నాడు (7:4తో పోల్చి చూడు). ఒకే ఒక దేవుడున్నట్టు ఎల్కానా గ్రహించాడు, మరియు యెహోవాను సేవించడానికి దేవునియందలి అతని విశ్వాసాన్ని బట్టి, తన ప్రమాణాల మేరకు తన పిల్లలు "జీవించేలా" ఎల్కానా జీవితం సవాలుగా నిలిచింది (యోబు 1:15తో పోల్చు). తన యింట తండ్రిగా ఆత్మ సంబంధమైన సంగతులను ముచ్చటించేవాడు (1:23; ద్వితీయో. 6:6-9). తన కుటుంబంపై ఆలాటి తండ్రి యొక్క ప్రభావం ఎంత బలంగా ఉంటుందో నీవు ఊహించగలవా? ఎల్కానావంటి దైవ భక్తిగల తండ్రిచే దీవించబడిన కుటుంబం నిజంగానే సంతోషంగా ఉంటుంది! (ఆది. 18:19).

ఒక తండ్రి మిస్సిసిపి నదీ తీరాన నివసించాడు. లోకం అతన్ని ధనవంతుడని పిలిచింది. ఒకరోజు జరిగిన ఆకస్మికపు ప్రమాదంవల్ల అతని పెద్ద కుమారుడు స్పృహతప్పి పోయాడు. త్వరగా డాక్టర్ని పిలిచారు తన కుమారుడు కోలుకుంటాడా అని అతడు డాక్టరును అడిగాడు. "లేదు, అతడు చనిపోతున్నాడు, కోలుకోడు" అని జవాబు వచ్చింది. "ఆ విషయం అతనికి చెప్పేలా అతన్ని స్పృహలోనికి తెప్పించగలవా?" అని తండ్రి వైద్యుని అడిగాడు. "అతడు చనిపోతున్నాడన్న సంగతి తెలియకుండ అతడు చనిపోవడం నాకు యిష్టం లేదు" అని అతడన్నాడు. వైద్యుడు ప్రయత్నించాడు, ఆ బాలుడు కొద్దిసేపు స్పృహలోనికి వచ్చాడు. "నీవు చనిపోతున్నావని డాక్టర్ అంటున్నాడు. ఇది నీకు తెలుపకుండ నేను నిన్ను చనిపోనియ్యలేకపోయాను" అని తండ్రి ఆ బిడ్డకు వినిపించాడు.

"నాయనా, నీవు నా కొరకు ప్రార్థించవా?" అని బిడ్డ అడిగాడు. దానికి వాని తండ్రి అవాక్కయి నిలిచాడు. అయితే చివరిగా, "నేను ప్రార్థించలేను, నా కుమారుడా" అని అతడు నెమ్మదిగా ఒప్పుకున్నాడు. అంతలో ఆ బిడ్డ స్పృహను కోల్పోయి త్వరలో చనిపోయాడు. ఈ సంఘటనలో అన్నిటిని మించిన మహా విషాదకరమైన సంగతి ఏమంటే, అతని కుమారుడు అతనితో అనేక సంవత్సరాలు ఉన్నా, వానికొరకు అతడు ఒక్కసారైనా ప్రార్థించలేదు!

**రెండవది, దేవునికి యిచ్చిన మాటను నిలబెట్టుకునే అవసరతను గూర్చి తన పిల్లలకు ఉపదేశించడంలో ఎల్కానా జాగ్రత్త వహించినవాడై యున్నాడు** (1:21). న్యాయాధిపతుల కాలమంతా వాగ్దానాలతో నిండినదైయుంది. అందులో యిక్కడ ఒక ఉదాహరణ ఉంది. ఈ మ్రొక్కుబడి హన్నా యొక్క విశ్వాసానికి సంబంధించినదై యుండవచ్చు. అతడు చేసిన వాగ్దానాన్ని గూర్చి ఎల్కానా యింటివారందరు తప్పక ఎరిగినవారై ఉంటారు. వారి తండ్రి మొదటిగా దేవునికి మాట యిచ్చి, ఆ మాటను అతడు నిలబెట్టు కొనడాన్ని వారు చూచినప్పుడు, దాన్ని గూర్చి ఎక్కువగా చెప్పనవసరం లేదు. ఆచరణలోఎల్కానా బలమైన పాఠాన్ని బోధించాడు. తండ్రులారా, దేవునికి మీరిచ్చిన మాటలను నెరవేర్చాలని మీరు మీ పిల్లలకు చూపడంలోని ప్రాముఖ్యతను ఆలోచించారా? నీ మాదిరి బహు ప్రబలమైన ప్రసంగమై ఉంటుంది. దేవునితో నీవు చేసికొనే ఒప్పందాలకు నమ్మకంగా ఉండడంతో దైవభక్తి జోడింపబడి ఉంటుంది (1 యోహాను 2:6; కీర్తనలు 1:1, 2; 116:17, 18; 2 రాజులు 15:1-3; మరియు ప్రసంగి 5:2-6లను చదువుము).

**మూడవది, దేవుని సముఖంలో హాజరై ఆరాధనలో పాల్గొనేటట్టు ఎల్కానా తన కుటుంబాన్ని ప్రోత్సహించాడు** (1:4, 21). ఇక్కడ క్రమం తప్పక ఆరాధించే తండ్రి ఉన్నాడు. తన బాధ్యతలు, ఆధిక్యతలచే పురికొల్పబడి అతడు ఆరాధించడానికి వెళ్లుటకు ఆతురతపడుతూ ఉండేవాడు. అతడు దానిని మానుకొనలేదు (నెహెమ్యా 10:39; హెబ్రీ. 10:25). అతడు కొంత దూరం ప్రయాణం చేయవలసియుండేది, అయినా ఆ కష్టం అతనిని ఆటంకపరచదు. తన కుటుంబమంతా తన వెంట వచ్చేలా అతడు జాగ్రత్త తీసికొనేవాడు. నియమం ప్రకారం అంతరాయం కలుగకుంటే, "అందరు" వెళ్లేవారు (1:21). ఆరాధన కుటుంబ సమయంగా గుర్తించబడింది. ఆరాధనలో కుటుంబ ఐక్యతను అతడు ప్రోత్సహించాడు. తన కుటుంబమంతా కలిసి వెళ్లడానికి ప్లానింగ్, బలులు అర్పించడానికి కావలసిన సిద్ధపాట్లు చేయవలసియుంటుంది. అతడు తండ్రిగా, దేవుని ఆరాధించడానికి కుటుంబానికి కావలసిన సిద్ధపాటును చేయవలసియుంటుంది. తండ్రిగా, దేవుని ఆరాధించడానికి, కుటుంబానికి అవసరమైదంతా సిద్ధం చేసేవాడు. అవసరమైన దానినంతా సంసిద్ధం చేసుకునే స్వభావంగల తండ్రి అతడు. అతని ఆరాధన - పూజించుట, ఒప్పుకొనుట, విన్నవించుకొనుట, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటలతో కూడివుంది. ఆరాధన అతనికి ముఖ్యమైనది!

అతడు ఆరాధననుండి తిరిగి వచ్చిన తరువాత కూడా దైవ భక్తి అతని హృదయాన్ని ఏలుతున్నట్టు సూచన కన్పిస్తుంది (1:19). పూజలతో ఎల్కానా విసిగిపోయినవాడు కాదు - సమస్త అవకాశాలను సద్వినియోగం చేసికోవాలనే ఆతురతగలవాడు. అతని

స్వభావం అతని కుటుంబానికి అద్భుతమైన సందేశాన్ని యిస్తున్న సంగతిని నీవు చూచావా? ఆరాధననుండి యింటికి తిరిగి వస్తూ (తమ కుటుంబాలతో) తండ్రులు ఎలా మసలుకోవాలో ఆలోచన చేస్తారు; అలాంటిది బిడ్డలను ప్రభావపరుస్తుంది (లూకా 11:28).

తన బిడ్డలు ఆరాధనలో పాల్గొనేలా ఎల్కాన ప్రోత్సహించినట్టు సూచన ఉంది (1:4). అర్పణ అర్పించబడుతుంది, అందులో కొంత భాగం ఆరాధకునికి యివ్వబడుతుంది. పండుగ ఆచరించబడుతుంది, బలిలో తిరిగి యివ్వబడిన భాగం భుజింపబడుతుంది. అట్టి భోజన సమయాలలో లేవీయులు, పేదలు, విధవరాండ్రు ఆహ్వానింపబడవలసిందిగా దేవుడు ఆజ్ఞాపించాడు (ద్వితీయో. 16:11). అందులో పాల్గొన్నవారు జరిపే కార్యాలు దేవునికి ఆరాధనగా భావింపబడతాయి. ఈ విధంగా, అట్టి సమయాలలో ఎల్కానా తన పిల్లలకు తర్ఫీదునిస్తూ ఉండేవాడు (ఎఫెసీ. 6:4). క్రమబద్ధంగా ఆరాధనకు అలవాటయ్యేలా తండ్రులు తమ పిల్లలకు తర్ఫీదునివ్వడం తగినది, తరచుగా పిల్లలు ఆరాధనా క్రమం విషయంలో చాలా తక్కువ తర్ఫీదు పొందుతారు, తత్ ఫలితంగా వారి ఆరాధన లోతు లేనిదిగాను, వ్యర్థమైనదిగాను మిగిలిపోతుంది!

## అతని పవిత్ర ప్రవర్తనకు ప్రతిఫలంగా వచ్చిన ఫలితాలు

ఎల్కానా యొక్క దైవ భక్తి అతని కుటుంబంలో ఇతరులతో వ్యవహరించడంలో మాత్రమే, అతని ప్రవర్తనలోను ఆ మంచి లక్షణాలు ప్రదర్శింపబడ్డాయి.

**మొదటిగా, అతడు (పరిస్థితిని సహృదయంతో) అర్థం చేసికోగలవాడైయున్నాడు** (1:23). తాను అర్థం చేసికోగలవాడు గనుకనే అనుకూలతను అతడు అంగీకరించాడు. నిర్బంధించే, కఠినంగా ఉండే, చలనంలేని తండ్రులు ఎల్కానా అనుభవించిన ప్రేమను తమ కుటుంబాలలో ఎన్నడు అనుభవించలేరు. తండ్రుల యొక్క దైవ భక్తి ఎల్కానావంటి సరళ ప్రవర్తన గ్రహింపుకు వారిని నడిపించినట్లయితే, అనేక కుటుంబాలు ఇంకా మెరుగ్గా ఉండగలవు. తండ్రులు నిర్బంధించనివారైయుంటే కుటుంబ సంఘీభావం బహు శ్రేష్ఠంగా ఉంటుంది. తండ్రి నెమ్మది కలిగి కఠినతకు, నిరంకుశ అధికారానికి తననుతాను నిగ్రహించుకుంటే, తన వ్యక్తిత్వాన్ని తాను తెలుసుకుంటే కుటుంబంలో సాంఘీక భావం వెల్లివిరుస్తుంది.

**రెండవదిగా, ఆత్మ సంబంధమైన విషయాలలో అతడు గాఢమైన అక్కరగలవాడై యున్నాడు** (1:21). ప్రతి ఏటా వెళ్లి వచ్చేది ఖాయం. దేవుని విషయమైన తన గాఢమైన అక్కరను కుటుంబానికి అందించగల తండ్రి యిక్కడున్నాడు. ఎల్కానా అక్కరను కనుపరచే విషయాలన్నిటిలో, ఆత్మ సంబంధమైనవాటికి ప్రధాన స్థానం యివ్వబడింది!

**మూడవదిగా, అతడు దేవునిపై ఆధారపడి ఉన్నాడు** (1:23, 28). బాలుడైన సమూయేలును చూస్తూ ఉండగా, తన బిడ్డను దేవుడు కాపాడి, ఎదుగునట్టు చేసి, దీవెనకరంగా వానిని ఉంచునట్లు అతడు ప్రార్థించాడు (1:23). సమస్తమును దేవుని చేతిలో ఉన్నట్టు అతడు ఎరిగి, యిష్ట పూర్వకంగా అతడు దేవునిపై ఆధారపడ్డాడు

(2:11). హన్నా యొక్క కోర్కెయే తప్పక ఎల్కానా యొక్క కోర్కెయైయుంది (1:28). తమ మగ శిశువు జీవించినంత కాలం అతని కాపుదల కొరకు వారు దేవునిమీద ఆధారపడి ఉన్నారు.

**నాల్గవదిగా, అతడు ఆశీర్వాదములను పొందాడు** (2:20). విత్తుట, కోయుట అనే సూత్రం (గలతీ. 6) యిక్కడ వర్తించింది. కీర్తన. 1లోని నీతిమంతుడైన మనుష్యుడు విశ్వాసానికి కట్టుబడి ఉన్నందుకు అధికంగా ఎలా దీవించబడ్డాడో, అలాగే ఎల్కానా తన దైవ భక్తిని బట్టి ఆశీర్వాదములనే పంటను కోశాడు. ఆలాటి దైవ భక్తిని విత్తిన తండ్రులందరు అలాటి దీవెనలనే కోస్తారు.

## ముగింపు

పురుషులారా, మీరు ఏలాటి తండ్రులైయున్నారు? నీవు నీ పిల్లలు కొనగోరే తండ్రివై యున్నావా? తండ్రిగా తన శ్రద్ధను నడిపించిన – దైవ భక్తి అనే గుణ లక్షణాన్ని ఎల్కానా కలిగియున్నాడు. దేవునితో సహకరించడానికిని, నీతి మార్గంలో తన పిల్లలను నడిపించడానికిని బాధ్యత గలవాడై పూర్తిగా అతడు నిమగ్నుడై ఉన్నాడు.

దైవ భక్తిగల తండ్రిగా నీకు సహాయపడేలా ఎల్కానా యొక్క ఈ మాదిరిని ఉపయోగించుకో. అనుదిన జీవితంలో నీ పిల్లలయెదుట దైవ భక్తితో కూడిన నీ విశ్వాస జీవితాన్ని కనుపరచు. దేవునికి చేసే వాగ్దానాలు నెరవేర్చవలసిన అవసరాన్ని నీ పిల్లలకు కనుపరచడానికి జాగ్రత్తపడు. దేవునికి సమర్పించే యథార్థమైన ఆరాధనలో నీ కుటుంబం పాలుపొందేలా ప్రోత్సహించు.

2:21 తరువాత ఎల్కానా కంటికి కన్పించకుండాపోతాడు. అయితే అతని తరువాత సంవత్సరాలను తిలకించు. సమూయేలు రామాకు తరలి వచ్చినప్పుడు అతని తల్లిదండ్రులు యింకను సజీవులుగానే ఉండియుండవచ్చు. అది అలా జరిగి ఉన్నట్టయితే, అతడు వారికి సమీపంగా జీవించి ఉంటాడు. ఎల్కానా దైవ భక్తిగల తాతయై ఉన్నట్టు సమూయేలు కుమారులు ఎరిగియుంటారు! అది ఎంతటి గంభీరమైన ఆలోచనయో! ప్రతి తండ్రి ఎల్కానాలా జీవించడానికి ప్రయాసపడి, దైవ భక్తికి పేరుపొందిన తండ్రిగా గుర్తింపబడును గాక!